క్లుప్తంగా

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో మాజీ సైనికులు

పోరుమామిళ్ల: నాడు కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన సైనికులకు మాజీ సైనికులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం పోరుమామిళ్లలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మాజీ సైనికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ జండా వందనం చేసి, అమరవీరుల స్తూపానికి రిత్‌ఫ్రేడ్ నిర్వహించారు. అనంతరం కార్గిల్ విజయ దివస్ గురించి, దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల గురించి మాట్లాడారు. కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు జరుపుకోవడం గర్వకారణంగా ఉందని కర్నల్ రాంబాబు, కర్నల్ రవి, మేజర్ కార్తీక్, కెప్టెన్ రాముడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌మాన్ సీబీఆర్ ప్రసాద్, ఎస్ఎక్స్‌సీసీ చైర్మన్ జగన్‌రెడ్డి, జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ భక్తవత్సలరెడ్డి, మాజీ సైనికుల సతీమణులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న రహదారి



నరసాపురం - ఓబులాపురం రోడ్డుపై నిలిచిన నీరు

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం నుంచి ఓబులాపురంకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. రహదారిలో గుంతలు పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీళ్లు నిలబడటంతో చెరువును తలపిస్తోంది. ప్రతి నిత్యం వందలాది మంది ఈ రహదారి గుండా జ్యోతి క్షేత్రానికి వెళుతుంటారు. అలాగే మండల కేంద్రానికి కూడా నిత్యం ప్రజలు తమ పనుల మీద వస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దుస్తుల పంపిణీ



విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ తులశమ్మ, సంస్థ ప్రతినిధులు

రాజుపాళెం : గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు సహకారం అందించాలనే ఉద్దేశంలోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఆన్ నీడ్ సంస్థ ప్రతినిధి ఎల్ ప్రసాద్ రెడ్డి అన్నారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్ రెడ్డి చిత్తా దంపతుల ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కొర్రపాడు, అర్కటవేముల, పర్లపాడు, వెలవలి, వెల్లాలలోని బాలికల గురుకుల పాఠశాలల్లో చదువుతున్న 892 మందికి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు.

ఉద్యోగుల సేవలు మరువలేనివి

బద్వేలు అర్బన్ : ఆరేళ్లుగా మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు సచివాలయం ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని ఆ వార్డు కౌన్సిలర్ గానుగపెంట సమత, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గానుగపెంట రమేష్‌బాబు పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా 7వ వార్డు సచివాలయంలో పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో వివిధ సచివాలయాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వార్డు సచివాలయంలో పనిచేసిన ఉద్యోగులు విధినిర్వహణలో బాధ్యతగా, నిజాయితీగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రొయ్యల క్రిష్ణ, ఇమామ్‌హుస్సేన్, నాగేంద్ర పాల్గొన్నారు.

నివాళి



చిన్న సుబ్బయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

మైదుకూరు(చాపాడు): మైదుకూరు మండలం పెద్దశెట్టిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ నేట్లపల్లి చిన్న సుబ్బయ్య అనారోగ్యంతో మృతి చెందడం పట్ల శాసన మండలి సభ్యులు ఆర్.రమేష్‌యాదవ్ విచారం వ్యక్తం చేశారు. చిన్న సుబ్బయ్య మృతి చెందిన విషయం తెలుసుకుని శనివారం ఎమ్మెల్సీ నేట్లపల్లి గ్రామానికి వెళ్లి చిన్న సుబ్బయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఈయన చిన్న సుబ్బయ్య కుమారులైన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నేట్లపల్లి శివరాం, రామాంజనేయులును పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సమస్యల వసతి!

- మరమ్మతులకు నోచని భవనాలు
- వినియోగానికి దూరంగా మరుగుదొడ్లు
- విద్యార్థులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని ప్రభుత్వం



పోరుమామిళ్లలో నెర్రెలు చీలి కూలి పోయేందుకు సిద్ధంగా ఉన్న హాస్టల్ భవనం

ప్రొద్దుటూరు కల్చరల్ : వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. అసౌకర్యాలే నడుమే విద్యార్థులు చదువులను కొనసాగించాల్సి వస్తోంది. మండలంలో 7 సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, 5 బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ మొత్తం 11 ఉన్నాయి. వీటిలో దాదాపు చాలా హాస్టల్స్‌లో గదుల కిటికీలు, తలుపులు దెబ్బతిన్నాయి. స్థానిక పాట్టిపాడు రోడ్డులోని ప్రభుత్వ ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహం-2లో 27 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్‌లో దోమల బెడద ఎక్కువగా ఉంది. హాస్టల్ ప్రాంగణంలో విష పురుగులు సంచరిస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఎస్సీ కళాశాల హాస్టల్‌లో 47 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్‌ను రిపేరు చేస్తుండటంతో గత కొన్ని నెలలుగా కళాశాల విద్యార్థులు కూడా బాలుర వసతి గృహంలోనే ఉంటున్నారు. దోమల బెడద తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు. మోడంపల్లె ఎస్సీ హాస్టల్-1, ఆనంద నిలయంలో కిటికీలకు మెష్ ఏర్పాటు చేసి దోమల బెడద నుంచి రక్షించాలని విద్యార్థులు కోరుతున్నారు. సాయి రాజేశ్వరి కాలనీలోని బీసీ కళాశాలల బాలుర హాస్టల్‌లో 72 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్‌లో దోమలు రాకుండా కిటికీలకు మెష్‌లను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. ఏడాది క్రితం బోర్ చెడిపోవడంతో మున్సిపల్ వాటర్‌ను సంప్‌లో నింపుకొని ఉపయోగించుకుంటున్నారు. వర్షం వస్తే హాస్టల్ వద్ద నీరు నిలుస్తుందని సమస్యను పరిష్కరించాలని హాస్టల్ విద్యార్థులు కోరుతున్నారు.

బద్వేలు పట్టణంలో..

బద్వేలు అర్బన్ : పట్టణంలో ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. శిథిలమైన భవనాలు, పెచ్చులూడుతున్న పైకప్పులు, అద్దె భవనాల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పట్టణంలో ఎస్సీ బాలుర వసతి గృహం-1లో 85 మంది, ఎస్సీ బాలుర వసతి గృహం-2లో 80 మంది, ఎస్సీ బాలికల వసతి గృహం-1లో 170 మంది, ఎస్సీ బాలికల వసతి గృహం-2లో 101 మంది, ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహంలో 105 మంది, బీసీ బాలుర వసతి గృహంలో 84 మంది, బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో 90 మంది చొప్పున మొత్తం 715 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఎస్సీ వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు ఇచ్చారు. బీసీ వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వలేదు. దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో ఇళ్ల వద్ద నుంచి తెచ్చుకున్న దుప్పట్లనే వాడుతున్నారు. అలాగే ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహం, బీసీ కళాశాల బాలికల వసతిగృహం అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇక్కడ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కూలిపోయే స్థితిలో ఎస్సీ బాలుర వసతిగృహం

పోరుమామిళ్ల: పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్ భవనం కూలిపోయే స్థితిలో ఉంది. 40 ఏండ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్నాయి. గోడలు నెర్రెలు చీలాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ భవనం ఎందుకూ పనికిరాదు. విద్యార్థులకు మౌలిక వసతులు కూడా లేవు. మూడేండ్లుగా కొత్త భవనం నిర్మిస్తారని చెప్పడమే కానీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు. ఈ హాస్టల్లో విద్యార్థుల సంఖ్య 101. అయితే వసతులు లేకపోవడంతో విద్యార్థులు పూర్తి సంఖ్యలో హాస్టల్‌లో ఉండడం లేదు.



ప్రొద్దుటూరులోని ఆనంద నిలయంలో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు



బద్వేలు బీసీ వసతిగృహంలో ఇళ్ల వద్ద నుంచి తెచ్చుకున్న దుప్పట్లు కప్పుకున్న విద్యార్థులు



పోరుమామిళ్లలో వర్షానికి ఉరుస్తున్న హాస్టల్ గది

తెలుగుభాషపై అవగాహన సదస్సులు



మాట్లాడుతున్న డాక్టర్ హనుమంతరావు

గోపవరం : జిల్లాలో ఎంపిక చేసిన విద్యాసంస్థల్లో తెలుగుభాష, మన సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఏపీ తెలుగుభాష వికాస ఉద్యమం జిల్లా అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ హనుమంతరావు, మొల్ల సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ విద్యార్థులకు మాతృభాషపై మమకారం కలిగించడమే కాక అంతరించిపోతున్న మన సంస్కృతి, సంప్రదాయాలను పాటించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తామన్నారు. గతంలో తెలుగుభాష వికాస ఉద్యమ సంస్థ పక్షాన జిల్లాలో తెలుగుభాష రథయాత్రలు చేశామన్నారు. ఈ ఏడాది మార్చిలో తెలుగు సాహితీయాత్రలు కొనసాగించామన్నారు. తెలుగుభాష అవగాహన సదస్సులను కవయిత్రిమొల్ల నివసించిన గోపవరం మండలంలోని పాఠశాలల నుండే ప్రారంభిస్తామన్నారు. ఈ సదస్సుల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి పుస్తక బహుమతులు అందిస్తామన్నారు. ఈ బృహత్తర భాషాయజ్ఞాన్ని జయప్రదం చేయవలసిందిగా తెలుగు భాషాభిమానులు, ఉపాధ్యాయులను కోరారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే



వరుడు విష్ణుతో ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, నాయకులు

చాపాడు: ఎంపీటీసీ తెలిదేల లక్షుమయ్య యాదవ్ కుమారుడు విష్ణువర్ధన్ వివాహ వేడుకల్లో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొన్నారు. విష్ణువర్ధన్ వివాహం శనివారం, ఆదివారాల్లో జరుగనుంది. శనివారం ముందుస్తు వివాహ వేడుకలో పాల్గొన్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే వరుడు విష్ణువర్ధన్ యాదవ్‌ను ఆశీర్వదించారు. జెడ్పీ చైర్మన్ ఎం.రామగోవిందరెడ్డి, ఉద్యాన శాఖ మాజీ ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చాపాటి రాజశేఖర్‌రెడ్డి, మండల నాయకులు జయరామిరెడ్డి, సీపీ సుబ్బారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అన్నవరం సురేష్‌రెడ్డి, లోమడ మైను పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

చాపాడు: హాస్టళ్లల్లో చదువుకుంటున్న విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కావ్యమాధురి పేర్కొన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చిన్నగురువళూరులోని బాలుర సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులకు వైద్యాధికారి కావ్యమాధురి వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వాటిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. విద్యార్థుల పట్ల ముందస్తు జాగ్రత్త కోసమే వైద్య శిబిరం ఏర్పాటు వైద్యపరీక్షలు నిర్వహించామని, వైద్య సిబ్బంది సూచనల తప్పసరిగా పాటించాలని వైద్యాధికారి సూచించారు. హస్టల్‌లో ఉండే విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తిన సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి చికిత్స పొందాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి గ్రామంలో డెంగీ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్ ప్రసాద్, వార్డన్ నాగకుమార్, ఎంఎల్‌హెచ్‌పీ శివమ్మ, ఏఎన్ఎం చంద్రకళ, వెంకటసుబ్బమ్మ, గంగాదేవి పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ మారుస్తానని మోసం

- 5 తులాల బంగారు నగలతో ఉడాయించిన దుండగుడు
- లబోదిబోమంటున్న వృద్ధ దంపతులు

ప్రొద్దుటూరు క్రైం : వృద్ధాప్య పింఛన్‌ను దివ్యాంగుల పింఛన్‌కు మారుస్తానని నమ్మించిన ఓ మోసగాడు 5 తులాల బంగారు నగలతో ఉడాయించాడు. ఈ ఘటన ప్రొద్దుటూరులోని చోటు చేసుకుంది. బద్వేలి గురివిరెడ్డి, లక్ష్మీదేవి వృద్ధ దంపతులు. నెహ్రూరోడ్డులో నివాసం ఉంటున్నారు. వీరికి సంతానం లేదు. లక్ష్మీదేవికి వచ్చే వృద్ధాప్య పింఛన్ డబ్బులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం సచివాలయం నుంచి వచ్చానని ఒక వ్యక్తి వారి ఇంటికి వచ్చాడు. మీకు వస్తున్న వృద్ధాప్య పింఛన్‌ను దివ్యాంగుల పింఛన్‌గా మార్పు చేయడానికి వచ్చానని నమ్మబలికాడు. వృద్ధాప్య పింఛన్ కంటే దివ్యాంగుల పింఛన్‌కు ఎక్కువ డబ్బు వస్తుందని చెప్పడంతో వృద్ధ దంపతులు సంతోషించారు. వెంటనే ఆధార్ కార్డు తీసుకొని వెళ్తే మున్సిపల్ ఆఫీసులో ఒక సర్టిఫికెట్ ఇస్తారని అతను వారితో అన్నాడు. ఆ సర్టిఫికెట్‌ను తెచ్చి సచివాలయంలో ఇవ్వమని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో గురివిరెడ్డి మున్సిపల్ కార్యాలయానికి బయలుదేరి వెళ్లాడు. అతను వెళ్లగానే లక్ష్మీదేవి ఒంటరిగా ఉందని తెలుసుకున్న ఆ దుండగుడు ఇంట్లోకి ప్రవేశించాడు. ఫొటో అప్‌డేట్ చేయాలని చెప్పి వృద్ధురాలికి ఫొటో తీసేందుకు సెల్‌ఫోన్ బయటికి తీశాడు. ఆమె ఒంటిమీద బంగారు నగలు ఉండటంతో వాటిని తీయమని చెప్పాడు. నగలతో ఫొటో దిగితే పింఛన్ రాదని, నగలను పక్కన పెట్టాలని చెప్పాడు. దీంతో ఆమె బంగారు గాజులు, ఇతర నగలను తీసి కిచెన్ రూంలో పెట్టింది. ఫొటో తీయమని ఆమె చెప్పగా ఇక్కడ చీకటిగా ఉందని ఫొటో సరిగా రాదని చెప్పి ఆమెను బెడ్ రూం సమీపంలోకి తీసుకెళ్లాడు. ఇదే అదునుగా భావించిన ఆ అగంతకుడు లక్ష్మీదేవిని బెడ్ రూంలోకి తోసేసి గడియ పెట్టాడు. కిచెన్ రూంలో ఉన్న నగలను తీసుకొని అక్కడి నుంచి ఉడాయించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో బయట ఉన్న వ్యక్తులు గడియ తీశారు. ఎవరో ఒక వ్యక్తి వచ్చి బంగారు నగలను దోచుకెళ్లాడని ఆమె బోరునా విలపించింది. లక్ష్మీదేవి ఐదు తులాల బంగారు నగలను గుర్తు తెలియని వ్యక్తి దోచుకెళ్లాడని త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు.

సుమధుర లైమ్‌లైట్ అవార్డు ప్రదానం

ప్రొద్దుటూరు క్రైం : పట్టణానికి చెందిన రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విభిన్న ప్రతిభావంతుడు కామిశెట్టి వెంకట్ సుమధుర లైమ్‌లైట్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ ప్రధాన్ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇమ్మిడి ఫౌండర్ అధినేత శివ చేతుల మీదుగా 2025 సుమధుర లైమ్‌లైట్ అవార్డును వెంకట్ తీసుకున్నారు.

సన్మానం



కల్లూరు నాగేంద్రారెడ్డికి స్వీట్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కల్లూరు నాగేంద్రారెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడిగా నియమితులైన గంజికుంట ఆంజనేయులు శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని దొరసానిపల్లెలోని ఆయన నివాసంలో కలిశారు. వారు తమను ఈ పదవుల్లో నియమించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, అందుకు సహకరించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు రాచమల్లుకు శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఎంపీపీ శేఖర్ యాదవ్, కౌన్సిలర్ చింపిరి అనిల్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

టాయిలెట్ కిట్ల పంపిణీ

కాశినాయన : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు శనివారం నరసాపురంలోని ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ నిర్మల ఉపాధ్యాయులకు టాయిలెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలోని టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు నిర్మించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఆదిత్యారెడ్డిని సత్కరిస్తున్న గురుమోహన్

పోరుమామిళ్ల: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీలో పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు, అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తోందని, వివిధ విభాగాల్లో పదవులు పొందినవారు పార్టీ బలోపేతం చేసేందుకు, పార్టీలో కిందిస్థాయి క్యాడర్‌తో మంచి సంబంధాలు కొనసాగించాలని సూచించారు. సింగసాని గురుమోహన్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శిగా నియమించినందుకు శనివారం ఆయన పోరుమామిళ్లకు వచ్చి ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గోవిందరెడ్డిని, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డిని సత్కరించారు. తన పదవికి న్యాయం చేస్తానని గురుమోహన్ పేర్కొన్నారు.

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత

మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి



మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి తెలిపారు. వివిధ పన్నుల రూపంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి ఏటా సుమారు రూ.50 కోట్లు ఆదాయం లభిస్తోందని, ఇందులో సగం డబ్బు పారిశుద్ధ్య నివారణకే ఖర్చు పెట్టాల్సి వస్తోందని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శనివారం సాయంత్రం పట్టణ వ్యాపార సంస్థలు, ఉపాధ్యాయులు, డ్వాక్రా మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మురికి కాలువల్లో తొలగించిన రెండు రోజులకే ప్లాస్టిక్‌తో కాలువలు నిండిపోతున్నాయన్నారు. ప్రొద్దుటూరు కంటే చిన్నదైన తాడిపత్రిలో ప్లాస్టిక్‌ను నిరోధానికి కారణం ప్రజల సహకారమేనన్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ టీ, సాంబారు లాంటి వేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లడం వల్ల వాటిలోని క్లోరోకార్బన్ కారణంగా ఆహారపదార్థాలు విషపదార్థాలుగా మారుతాయని తెలిపారు. 120 మైక్రాన్లకన్నా ఎక్కువ ఉండే ప్లాస్టిక్ కవర్లను మాత్రమే వాడాలని సూచించారు. సిరిపురి పట్టణంగా పేరొందని ప్రొద్దుటూరులో ప్లాస్టిక్ ప్రభావం ఎక్కువగా ఉందని తెలిపారు. పట్టణ వ్యాపార సమాఖ్య అధ్యక్షుడు వీరభద్రయ్య, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎంఆర్, డాక్టర్ ధనిరెడ్డి నరసింహారెడ్డి, ప్రముఖ వ్యాపార వేత్త సీవీ సురేష్ పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ సందడి



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

రాజుపాళెం : శ్రావణమాసంలో తొలి శనివారం సందర్భంగా ఆలయాల్లో భక్త జన సందడి నెలకొంది. శనివారం మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలో భక్తుల సందడి నెలకొంది. చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాములను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆశీనులు చేశారు. భక్తుల సందోహం మధ్య స్వాములను అంగరంగ వైభవంగా భక్తులు ఊరేగించారు. ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, ఆలయ మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల సందడి

అట్లూరు: శ్రావణమాస మొదటి శనివారం కొండ గోపాలస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. లంకమల్లేశ్వర అభయారణ్యంలో కొండ కోనల మధ్య వెలసిన శ్రీ కొండగోపాలస్వామి ఆలయంలో ప్రతి ఏటా శ్రావణమాసంలోని శనివారాల్లో స్వామి వారికి పూజలు చేయడం ఆనవాయితీ. భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బుడ్డాయపల్లెలోని అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. విశేష అభిషేకాలు, అర్చనలు చేసి స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి, పెన్నానది తీరంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస తొలి శనివారం సందర్భంగా పూజలు చేశారు. అలాగే రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించారు.

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం మొదటి శనివారం ప్రారంభంతో వైభవంగా అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామిని తులసి ఆకులతో ప్రత్యేక అలంకరించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

అన్నీ అబద్ధపు హామీలే

అట్లూరు : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో అన్నీ అబద్ధపు హామీలుగానే మిగిలిపోతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్ రెడ్డి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బాలమునిరెడ్డి ఎద్దేవాచేశారు. శనివారం ముత్తుకూరు పంచాయతీ పరిధిలోని ముత్తుకూరు, బోడిశెట్టిపల్లె, చిట్టెంవారిపల్లె, శాంతినగర్, చౌటపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ పథకాలు ప్రతి కుటుంబానికి అందజేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పంటల బీమా, రైతుభరోసా పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. మండల ఉపాధ్యక్షుడు రాజవోలుసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పొన్నవోలుబ్రహ్మానందరెడ్డి, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, వేమలూరు ఉపసర్పంచ్ మునెయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లవోలుగోపిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, శ్యాంసుందర్, శివారెడ్డి, బుర్రివేణుగోపాల్ పాల్గొన్నారు.

ఇమాం, మౌజన్లకు గౌరవవేతనం ఇవ్వాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఏపీ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యుడు బేపారి జాకీర్ అహ్మద్‌ను శనివారం చాపాడు మండలం ద్వారకానగర్‌కు చెందిన ఆస్థాన మహబూబ్ సుభాని ఆశ్రమం గౌరవ అధ్యక్షుడు హజరత్ సమీపీర్ అబ్దుల్ హక్‌షా ఖాద్రి చిష్టి కలిశారు. ఈ సందర్భంగా ఆయన ద్వారకానగర్‌లోని అల్‌నూర్ మసీదుకు సంబంధించిన ఇమాం, మౌజన్లకు ప్రభుత్వ గౌరవ వేతనాలను ఇవ్వాలని కోరారు. మసీదు ఖాళీ స్థలంలో షాదీఖానా నిర్మించేందుకు వక్ఫ్‌బోర్డు ద్వారా సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హజరత్ అబ్దుల్ హక్‌ఖాద్రి శిష్యబృందం షేక్ అల్లాబకాష్, షేక్ అహ్మద్, షేక్ ఇబ్రహీం, షేక్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకాలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బద్వేలు నియోజకవర్గలలోని మండలాలకు పార్టీ కమిటీలను నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

అట్లూరు మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా ఎం.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.లక్ష్మినరసారెడ్డి, ఆర్.శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బి.కృష్ణారెడ్డి, యు.రామసుబ్బారెడ్డి, ఎంవీ రమణారెడ్డి, బి.తిరుపాల్‌రెడ్డి, కార్యదర్శులుగా ఎస్.ఓబుల్‌రెడ్డి, మన్నెం బ్రహ్మరెడ్డి, ఎస్.శ్రీనివాసులురెడ్డి, ఎస్.చెంచునాగిరెడ్డి, సి.రామయ్య, ఎస్.పెంచల్‌రెడ్డిలతోపాటు 25 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

బి.కోడూరు మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా ఎస్.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.శేష్ రెడ్డి, ఎస్.రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఎన్.భూ సుబ్బారెడ్డి, కె.నారాయణరెడ్డి, ఎల్.వెంకట సుబ్బారెడ్డి, కె.మునిరెడ్డి, కార్యదర్శులుగా ఎల్.రామచంద్రారెడ్డి, కె.సుబ్బారెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, వెంకట సుబ్బయ్య, పి.సిద్దేశ్వరరెడ్డి, ఎ.వెంకట సుబ్బయ్యలతోపాటు 9 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

బద్వేలు మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా పి.మల్లేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.చెంచయ్య, బి.రామసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పి.రమణారెడ్డి, కె.రమణ, ఎస్.ఈశ్వర్‌రెడ్డి, టి.బాలసుబ్బయ్య, కార్యదర్శులుగా టి.శేఖర్, ఎ.రాంప్రసాద్‌రెడ్డి, ఎ.వివేకానందరెడ్డి, ఎం.మచ్చయ్య, ఎం.రఘురామిరెడ్డి, ఎం.రామసుబ్బయ్యలతోపాటు 34 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

బద్వేలు మున్సిపల్ పార్టీ కమిటీ

అధ్యక్షులుగా జి.సుందర్‌రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా టి.సునీల్, ప్రధాన కార్యదర్శులుగా బి.వెంకటసుబ్బారెడ్డి, ఎస్.రాజేష్, సి.వెంకటేశ్వర్లు, ఓబులేశు, కార్యదర్శులుగా వి.సుబ్బరాజు, ఎం.రజనీకాంత్, సి.బాబు, బి.సుబ్బారెడ్డి, ఖాదర్‌ఖాన్‌లతోపాటు 36 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

గోపవరం మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా సి.రవిచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.మల్లేష్, పి.శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కె.వెంకటేశ్‌రెడ్డి, బి.చిన్నసుబ్బారెడ్డి, టి.శ్రీనివాసులరెడ్డి, ఎం.నరసింహులు, కార్యదర్శులుగా బి.ఓబుల్‌రెడ్డి, ఎస్.సుబ్బరాయుడు, కె.రాజశేఖర్‌రెడ్డి, టి.శ్రీనివాసులు, కె.తిరుపాల్, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డితోపాటు 40 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

కలసపాడు మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా ఎస్.సుదర్శన్, ఉపాధ్యక్షులుగా ఎస్.రామకృష్ణారెడ్డి, ఎ.గురివిరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పి.పురుషోత్తంరెడ్డి, బి.నారాయణ్, కె.రమణారెడ్డి, జి.వెంకటరెడ్డి, కార్యదర్శులుగా షేక్ షరీఫ్, ఎస్.లక్ష్మికాంత్‌రెడ్డి, డి.ఓబయ్య, డి.శ్రీనివాసులురెడ్డి, డేవిడ్, కె.దామోదర్‌రెడ్డితోపాటు 14 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

పోరుమామిళ్ల మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా సీఎం బాషా, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటరెడ్డి, పి.శివయ్య, ప్రధాన కార్యదర్శులుగా సుంకర అషాక్, బి.వెంకటేశ్వర్లు, జి.లక్ష్మిరెడ్డి, ఎం.బాలకేశవ, కార్యదర్శులుగా వై.సుబ్రమణ్యం, ఎ.మోహన్, కె.గురుప్రసాద్, పి.పాటి రామయ్య, సి.తిరుపతయ్య, ఆర్.సుబ్బరాయుడుతోపాటు 33 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

కాశినాయన మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా జి.హనుమంతరెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.వెంకట శేషయ్య, జి.వెంకట రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా జి.సుబ్బారెడ్డి, వై.బాలయ్య, ఎం.సుదర్శన్‌రెడ్డి, జి.కృష్ణారెడ్డి, కార్యదర్శులుగా జి.వెంకటేశ్వరరెడ్డి, జి.శశికుమార్‌రెడ్డి, బి.రామిరెడ్డి, వి.మాబుసుబాన్, సి..పీరయ్య, ఆర్‌జీ బాలకృష్ణతోపాటు 43 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.